



అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..




సంపుటి - 2 సంచిక - 197 మంగళవారం 28 అక్టోబర్ 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# మొదలైన మొంథా

## ఏపీ తీరం వైపు 'మొంథా' తుపాను

## తీవ్రరూపం దాల్చే అవకాశం

పలుచోట్ల ఈదురు గాలులతో కూడిన వర్షాలు

ప్రస్తుతం కాకినాడకు 570 కి.మీ దూరంలో కేంద్రీకృతం

తీరం వెంబడి గంటకు 110 కి.మీ వేగంతో గాలులు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్న విపత్తుల నిర్వహణ సంస్థ





## ఆందోళన వద్దు.. అప్రమత్తంగా ఉందాం

మొంథా తుపానుపై కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం చంద్రబాబు సమీక్ష

రియల్ టైంలో ప్రజలకు సమాచారం అందాలి

తుపాను బాధితులకు రూ.3 వేలు, 25 కిలోల బియ్యం: చంద్రబాబు ఆదేశాలు

**అమరావతి, అక్టోబర్27:( జర్నలిస్ట్ వార్త):** బంగాళాఖాతంలో ఏర్పడిన 'మొంథా' తుపాను ప్రభావం ఆంధ్రప్రదేశ్ కోస్తా జిల్లాలపై ప్రారంభమైంది. తుపాను కారణంగా ఇప్పటికే పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. తుపాను తీరానికి సమీపించే కొద్దీ దీని ప్రభావం మరింత తీవ్రంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది.

విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించిన తాజా వివరాల ప్రకారం, 'మొంథా' తుపాను గడిచిన 6 గంటల్లో గంటకు 18 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ వాయవ్య దిశగా కదులుతోంది. ప్రస్తుతం ఇది చెన్నైకి 520 కిలోమీటర్లు, కాకినాడకు 570 కిలోమీటర్లు, విశాఖపట్నంకు 600 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఈ తుపాను మరింత బలపడి రేపు (మంగళవారం) ఉదయానికి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో తీరం వెంబడి గంటకు 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు, ముఖ్యంగా మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ సూచించారు.

మిగతా 2లో...

# దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణ


## త్వరలో ఎన్నికలు జరుగున్న రాష్ట్రాల్లో నిర్వహణ

## కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్




**న్యూఢిల్లీ, అక్టోబర్27:( జర్నలిస్ట్ వార్త):** దేశవ్యాప్తంగా ఎన్నికల జాబితాలలో సవరణలను చేపట్టనున్నట్టు కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ప్రకటించారు. తొలిదశ బీహార్‌లో విజయవంతంగా ముగిసిందని మలిదశ త్వరలో ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాల్లో నిర్వహిస్తామని అన్నారు. సోమవారంనాడిక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ వివరాలను సీఈసీ వెల్లడించారు. రెండో విడతలో 9 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాలు ఉంటాయని చెప్పారు. వీటిలో పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు ఉన్నాయి. వివిధ రాష్ట్రాల్లోని ఓటర్ల జాబితాను నవీకరించడం, ధృవీకరించడం,మిగతా 2లో...





# 'డిజిటల్ అరెస్ట్' మోసాలపై సుప్రీం సీరియస్...

## అన్ని రాష్ట్రాలకు నోటీసులు

2లో.

'డిజిటల్ అరెస్ట్' మోసాలపై సుప్రీంకోర్టు సుమోటో విచారణ

అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ

మోసాలకు సంబంధించిన ఎఫ్ఐఆర్ వివరాలు సమర్పించాలని ఆదేశం

ఇది దేశవ్యాప్త కుంభకోణం.. దర్యాప్తు సీబీఐకి అప్పగించేందుకు మొగ్గు

ఈ మోసాల వెనుక మయన్మార్, థాయ్‌లాండ్ ముఠాలు ఉన్నాయని వెల్లడి

# అప్రమత్తంగా ఉండి చర్యలు తీసుకోవాలి

కాకినాడ వద్ద తీరం దాటనున్న మొంథా తుఫాన్

జిల్లా అధికారులతో పవన్ కళ్యాణ్ సమీక్ష



**అమరావతి,అక్టోబర్27:( జర్నలిస్ట్ వార్త):** మొంథా తుపాను నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచించారు. మొంథా తుపాను కాకినాడ ప్రాంతంలో తీరం దాటనుందని తెలిపారు. ఈ క్రమంలో కాకినాడ జిల్లాలో చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో పవన్ కల్యాణ్ తన క్యాంపు కార్యాలయంలో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షకు కాకినాడ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పి. నారాయణ, స్పెషల్ ఆఫీసర్ కృష్ణ తేజ, జిల్లా కలెక్టర్ షాన్ మోహన్, జిల్లా ఎస్పీ బిందు మాధవ్, ఇతర అధికారులు హాజరయ్యారు.

మిగతా 2లో...

# రైతుకు నష్టం కలగొద్దు

## కొనుగోళ్లపై అప్రమత్తంగా ఉండాలి : సీఎం రేవంత్ రెడ్డి




కొనుగోలు చేసిన ధాన్యం మిల్లులకు తరలింపు

: ఉన్నతాధికారులకుమంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశ

మొంథా తుపాన్ నేపథ్యంలో చర్యలు

ధాన్యం చెడిపోకుండా టార్పాలిన్‌ల వినియోగం

**హైదరాబాద్, అక్టోబర్27:( జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలో వర్ష సూచనల నేపథ్యంలో ధాన్యం, పత్తి, మొక్కజొన్న కొనుగోళ్లపై అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రైతులకు నష్టం జరగకుండా కొనుగోళ్లు జరిగేలా అన్ని చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారుమిగతా 2లో...



# తదుపరిసిజెఐగా జస్టిస్ సూర్యకాంత్

## కేంద్రానికి సిఫార్సు చేసిన ప్రస్తుత సిజెఐ గవాయ్



**న్యూఢిల్లీ, అక్టోబర్27:( జర్నలిస్ట్ వార్త):**సుప్రీంకోర్టు కొత్త ప్రధాన నాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ నియామకం కానున్నారు. ఆయన పేరును సీజేఐ భూషణ్ రామకృష్ణ గవాయ్ కేంద్రానికి సిఫారసు చేశారు. జస్టిస్ సూర్యకాంత్ పేరును ఒక లేఖలో కేంద్ర న్యాయశాఖ మంత్రికి ఆయన తెలియజేశారు. గవాయ్ వారసుడి ఎన్నిక పక్రియనుమిగతా 2లో...

# ముగిసిన మద్యం షాపుల లాటరీ ప్రక్రియ

## 2,601 దుకాణాల కేటాయింపు

## వివిధ కారణాలతో 19 షాపుల డ్రా నిలిపివేత

## డిసెంబర్ 1నుంచి కొత్త దుకాణాలు

**హైదరాబాద్ అక్టోబర్27:( జర్నలిస్ట్ వార్త):** మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిం ది. రాష్ట్రవ్యాప్తంగా 2,620 దుకాణాలకు వచ్చిన 95,137 దరఖాస్తులను 34 కేంద్రాల్లో జిల్లా కలెక్టర్ల సమక్షంలో డ్రా తీసి 2,601 షాపులను కేటాయించారు. వివిధ కారణాలతో 19 దుకాణాల లాటరీ నిలిపివేశారు. మండలం, జిల్లా, మున్సిపాల్టీ, కార్పొరేషన్ పరిధిలో షాపులు దక్కించుకున్న వారు రెండ్రోజుల్లో నిర్దేశిత లైసెన్స్ ఫీజులో మొదటి విడుత చెల్లించి కన్ఫర్మేషన్ లెటర్ పొందాలని అధికారులు పేర్కొన్నారు.మిగతా 2లో...



# ఆటోడ్రైవర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ -తెలంగాణ భవన్‌కు ఆటోడ్రైవర్ల ర్యాలీ

## ఆటోలో ప్రయాణించిన మాజీమంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్ అక్టోబర్27:( జర్నలిస్ట్ వార్త):** ఆటోడ్రైవర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల నుంచి బంజారాహిల్స్‌లోని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యాలయం తెలంగాణ భవన్‌కు ఆటో డ్రైవర్ల ర్యాలీ నిర్వహించారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి ఆటోలో కేటీఆర్ ప్రయాణించారు. మిగతా 2లో...



# ఏం.. మీరు న్యూస్ పేపర్లు చదవడంలేదా?...

వీధి కుక్కల నియంత్రణపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం

ఆదేశాలు పాటించని రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలకు సమన్లు

పశ్చిమ బెంగాల్, తెలంగాణ ప్రభుత్వాలకు మినహాయింపు

నవంబర్ 3న కోర్టుకు హాజరు కావాలని ఆదేశం

దేశ ప్రతిష్ట దెబ్బతింటోందని ధర్మాసనం కీలక వ్యాఖ్య

హాజరు కాకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



2లో.

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక



# తదుపరి సిజెఐగా జస్టిస్ సూర్యకాంత్

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ఇటీవల ప్రారంభించిన నేపథ్యంలో తాజా పరిణామం చోటుచేసుకుంది. నిబంధనల ప్రకారం సుప్రీంకోర్టు సీనియర్ జడ్జిని సీజేఐ పదవికి ఎంపిక చేస్తారు. ప్రస్తుతం అత్యున్నత న్యాయస్థానంలో జస్టిస్ కాంత్ సీనియర్ మోస్ట్ న్యాయమూర్తిగా ఉన్నారు. గవాయ్ నవంబర్ 23న పదవీ విరమణ చేయనున్నారు. దీంతో దేశ 53వ సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ బాధ్యతలు చేపడతారు. 2027 ఫిబ్రవరి 9వ తేదీ వరకూ ఆయన ఈ పదవిలో ఉంటారు. హర్యానాలోని హిస్సార్‌లో 1962 ఫిబ్రవరి 10న జస్టిస్ సూర్యకాంత్ జన్మించారు. 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయ్యారు. 370వ అధికరణ రద్దు, భావ ప్రకటనా స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, అవినీతి, పర్యావరణం, లింగ సమానత్వం వంటి కీలక తీర్పులు ఇచ్చిన ధర్మాసనాల్లో ఆయన ఉన్నారు. ఎన్నికల జవాబుదారీతనంపై తన నిబద్ధతను చాటుకుంటూ బిహార్ ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 65 లక్షల మంది వివరాలను వెల్లడించాలని ఇటీవల ఎన్నికల కమిషన్‌ను ఆయన ఆదేశించారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్‌తో సహా బార్ అసోసియేషన్లలో మూడింట ఒక వంతు సీట్లు మహిళలకు రిజర్వ్ చేయాలని చారిత్రక ఆదేశాలు సైతం ఇచ్చారు. 2022లో ప్రధాని నరేంద్ర మోదీ పంజాబ్ పర్యటనలో భద్రతా లోపాలపై దర్యాప్తునకు ఐదుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించిన ధర్మాసనంలో ఆయన కూడా ఉన్నారు. రక్షణ బలగాలకు ఓఆర్‌ఓపీ స్కీమ్‌ను సైతం ఆయన ధ్రువీకరించారు. పెగాసస్ స్పైవేర్ కేసును విచారించిన ధర్మాసనంలోనూ జస్టిస్ సూర్యకాంత్ ఉన్నారు.

# దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణ

(మొదటి పేజీ తరువాయి)

అనర్హులైన ఓటర్లను తొలగించడం, నిజమైన ఓటర్లను మాత్రమే జాబితాలో ఉంచడానికి ఎన్నికల కమిషన్ ఈ ప్రక్రియ చేపడుతోంది. ఎన్నికల జాబితా క్వాలిటీపై ప్రతి ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీలు లేవనెత్తుతున్నందున ఎస్ఐఆర్ ప్రక్రియ చేపట్టడం అవసరమైందని సీఈసీ చెప్పారు. 1951 నుంచి 2004 వరకూ 8 సార్లు ఎస్ఐఆర్ నిర్వహించామని, చివరిసారిగా 21 ఏళ్ల క్రితం 2002–2004 మధ్య చేపట్టామని చెప్పారు. ఈ క్రమంలో ఇటీవల బిహార్‌లో తొలి విడత ఎస్ఐఆర్ పూర్తి చేసినట్టు చెప్పారు. ఎస్ఐఆర్ ఫేజ్–2 షెడ్యూల్‌ను ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 28 నుంచి నవంబర్ 3 వరకూ ప్రింటింగ్/ ట్రైనింగ్ ఉంటుంది. నవంబర్ 4 నుంచి డిసెంబర్ 4 వరకూ హౌస్ టు హౌస్ ఎన్యూమరేషన్ ఫేజ్ ఉంటుంది. హియరింగ్/వెరిఫికేషన్ ప్రక్రియ డిసెంబర్ 9 నుంచి 2026 జనవరి 31 వరకూ జరుగుతుంది. 2026 ఫిబ్రవరి 7న తుది ఎన్నికల జాబితా విడుదలవువుంది.రెండో విడత ఎస్ఐఆర్ జరుగనున్న రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్ , తమిళనాడు, గోవా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, గుజరాత్, కేరళ, రాజస్థాన్ ఉన్నాయి. కేంద్ర పాలిత ప్రాంతాల్లో అండమాన్ నికోబార్ ఐలాండ్స్, లక్షద్వీప్, పుదుచ్చేరి ఉన్నాయి.

# రైతుకు నష్టం కలగొద్దు

(మొదటి పేజీ తరువాయి)

సీఎం ఆదేశాలతో సోమవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లు, సంబంధిత ఉన్నతాధికారులతో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మొంథా తుపాను ప్రభావం తెలంగాణపై ఉండే అవకాశముండటంతో అప్రమత్తంగా ఉండాలని ఉన్నతాధికారులను పౌరసరఫరాలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. వానాకాలం ధాన్యంతో పాటు మొక్కజొన్న పంటలు దెబ్బతినకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు నష్టపోకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని అందుబాటులో ఉన్న టార్పాలిన్‌లను వినియోగించి చెడిపోకుండా చూడాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని సత్వరమే మిల్లులకు తరలించేందుకు అవసరమైన రవాణా వసతి ఏర్పాటు చేసుకోవాలన్నారు. రాబోయే 30 నుంచి 45 రోజుల వరకు ధాన్యం కొనుగోళ్లలో అధికార యంత్రాంగం సమిష్టిగా పని చేయాలని ఆదేశించారు. అకాల వర్షాలు సంభవిస్తున్న నేపథ్యంలో వరి కోతలు నిలిపేస్తే రైతులకు ఇబ్బంది ఉండదని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 8,342 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో ఇప్పటికే 4,428 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్టు తెలిపారు. మిగిలిన 3,814 కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలన్నారు.సోమవారం నాటికి 22,433 మంది రైతుల నుంచి 1,80,452 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు తెలిపారు. అందులో దొడ్డు రకం 73,628 మెట్రిక్ టన్నులు, సన్నాలు 1,06,824 మెట్రిక్ టన్నులున్నాయనీ, వాటి విలువ రూ.431.09 కోట్లు అని చెప్పారు. కొనుగోలు చేసిన ధాన్యానికి త్వరితగతిన చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ జరపాలనీ, కొనుగోలులో రైతులకు ఎక్కడా ఆటంకాలు కలుగకుండా చూడాలని అన్నారు. కేంద్రాలను ఎప్పటికప్పుడు కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖాధికారులు సందర్శించి అక్కడి పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు.

# ముగిసిన మద్యం షాపుల లాటరీ ప్రక్రియ

(మొదటి పేజీ తరువాయి)

కొత్త షాపులు డిసెంబర్ ఒకటి నుంచి అందుబాటులోకి రానున్నాయని, 2027 నవంబర్ 30 వరకు రెండేండ్లు వీటి కాలపరిమితి ఉంటుందని తెలిపారు. 2023లో 1.32 లక్షల దరఖాస్తులు రాగా ఈసారీ 37 వేలకుపైగా తగ్గాయి. దరఖాస్తు ఫీజును రూ.2 లక్షల నుంచి రూ.3లక్షల వరకు పెంచడంతో పాటు పలు చోట్ల వ్యాపారులు సిండికేట్ కావడంతో తక్కువ అప్లికేషన్లు వచ్చినట్టు భావిస్తున్నారు. దరఖాస్తులు తగ్గినా ఫీజు పెంపుతో గతం కంటే రూ.200 కోట్ల వరకు అధికంగా ఆదాయం వచ్చింది. దరఖాస్తుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని రాష్ట్ర వ్యాప్తంగా పరిశీలిస్తే మూడొంతులకు పైగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి దాని చుట్టు పక్కల ప్రాంతాల నుంచే రావడం గమనార్హం.వివిధ కారణాలతో నిలిచిపోయిన 19 మద్యం దుకాణాలకు డ్రా ను నవంబర్ 3న నిర్వహించనున్నట్టు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణకు ఎక్సైజ్ శాఖ ఈనెల 28న నోటిఫికేషన్ విడుదల చేయనుంది. నవంబర్ ఒకటి వరకు ఐదు రోజుల పాటు దరఖాస్తులు స్వీకరిస్తారు. నిలిచిపోయిన వాటిలో ఆసిఫాబాద్ జిల్లాలో 7, ఆదిలాబాద్ జిల్లాలో 6, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 2, శంషాబాద్ ఎక్సైజ్ జిల్లాలో 3, సంగారెడ్డి జిల్లాలో ఒక షాపు ఉన్నాయి.

# ఆటోడ్రైవర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

(మొదటి పేజీ తరువాయి)



కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ఎన్నికలకు ముందు ఆటోలో తీసుకెళ్లిన ఆటో డ్రైవర్ (అప్పుడు యజమాని) మష్రత్ అలీ ఆటోలోనే కేటీఆర్ ప్రయాణించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ ప్రయాణించిన ఆటో యజమాని రెండు ఆటోలను అమ్ముకుని డ్రైవర్ అయ్యారని తెలిపారు. కాంగ్రెస్ రెండేండ్ల పాలనలో ఆ ఆటో యజమాని రెండు ఆటోలను అమ్ముకునే పరిస్థితి తెచ్చారని విమర్శించారు. మష్రత్ అలీ పరిస్థితి అడిగి తెలుసుకున్న కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ చేసిన ద్రోహాన్ని ప్రతిపక్ష పార్టీగా ఎండగడుతామని హెచ్చరించారు. మరోవైపు గోకుల్ థియేటర్ నుంచి తెలంగాణ భవన్ చేరిన ర్యాలీని ఉద్దేశించి మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడారు.కాంగ్రెస్ ఆటోడ్రైవర్లకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో లభించిన సబ్సిడీలు, బెనిఫిట్స్ అన్ని నిలిచిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు అండగా నిలిచే పార్టీ బీఆర్ఎస్ పార్టీయేనని తెలిపారు. ఈ ర్యాలీలో కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# ఏం.. మీరు న్యూస్ పేపర్లు చదవడంలేదా?...

## వీధి కుక్కల నియంత్రణపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం

**న్యూఢిల్లీ అక్టోబర్27:( జర్నలిస్ట్ వార్త):**
వీధి కుక్కల నియంత్రణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాల ఉదాసీన వైఖరిపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తాము జారీ చేసిన ఆదేశాలను పాటించడంలో విఫలమైనందుకు పశ్చిమ బెంగాల్, తెలంగాణ మినహా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల చీఫ్ సెక్రటరీలకు (ప్రధాన కార్యదర్శులు) సమన్లు జారీ చేసింది. వారంతా నవంబర్ 3న తమ ఎదుట వ్యక్తిగతంగా హాజరు కావాలని సోమవారం ఆదేశించింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి. అంజారియాలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) రూల్స్, 2023 అమలుపై తీసుకున్న చర్యలను వివరిస్తూ అఫిడవిట్లు దాఖలు చేయాలని ఈ ఏడాది ఆగస్టులోనే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా, చాలా రాష్ట్రాలు పట్టించుకోకపోవడంపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. "అధికారులు వార్తాపత్రికలు చదవడం లేదా? సోషల్ మీడియా చూడటం లేదా? ఆదేశాలు అందకపోయినా, అఫిడవిట్లు ఇక్కడ ఉండాల్సింది. నవంబర్ 3న చీఫ్ సెక్రటరీలందరూ తప్పనిసరిగా కోర్టులో హాజరు కావాలి" అని జస్టిస్ విక్రమ్ నాథ్ నేతృత్వంలోని బెంచ్ వ్యాఖ్యానించింది.
పశ్చిమ బెంగాల్, తెలంగాణ ప్రభుత్వాలతో పాటు ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) మాత్రమే అఫిడవిట్లు దాఖలు చేశాయని కోర్టు గుర్తించింది. "దేశంలో వీధి కుక్కలకు సంబంధించిన ఘటనలు నిరంతరం జరుగుతూనే ఉన్నాయి. దీనివల్ల విదేశాల దృష్టిలో మన దేశ ప్రతిష్ఠ దెబ్బతింటోంది. మేం కూడా వార్తా కథనాలను చదువుతున్నాం" అని ధర్మాసనం ఆవేదన వ్యక్తం చేసింది. ఇదే సమయంలో, ఈ కేసులో తమను కూడా భాగస్వాములను చేయాలని కోరుతూ వివిధ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్లు (%=ఔూ%), వ్యక్తులు దాఖలు చేసిన పిటిషన్లపై కూడా కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. "దేశంలోని %=ఔూ%లన్నీ ఈ కేసులో పార్టీలుగా చేరతామంటే, మన ముందు కోట్లాది మంది ఉంటారు కదా? సహేతుకమైన సూచనలు చేయండి" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.
తదుపరి విచారణ తేదీన చీఫ్ సెక్రటరీలు హాజరు కాకపోతే, కఠిన చర్యలతో పాటు జరిమానాలు కూడా విధిస్తామని సుప్రీంకోర్టు హెచ్చరించింది. ఢిల్లీ విషయంలో ఎంసీడీ ఇచ్చిన నివేదిక సరిపోదని, అఫిడవిట్ ఎందుకు దాఖలు చేయలేదో ఢిల్లీ చీఫ్ సెక్రటరీ వివరణ ఇవ్వాలని ఆదేశించింది.కాగా, ఆగస్టు 22న ఇచ్చిన ఆదేశాల ప్రకారం, కుక్కల స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ కార్యక్రమాలతో పాటు, వాటి కోసం ఏర్పాటు చేసిన షెల్టర్ల వివరాలతో అన్ని రాష్ట్రాలు నివేదికలు సమర్పించాల్సి ఉంది. ఈ కేసు తదుపరి విచారణ నవంబర్ 3న జరగనుంది.

# 'డిజిటల్ అరెస్ట్' మోసాలపై సుప్రీం సీరియస్...

## అన్ని రాష్ట్రాలకు నోటీసులు

**న్యూఢిల్లీ, అక్టోబర్27:( జర్నలిస్ట్ వార్త):**
దేశవ్యాప్తంగా పెరిగిపోతున్న 'డిజిటల్ అరెస్ట్' మోసాలపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. పోలీసులు, న్యాయాధికారులమంటూ నకిలీ కోర్టు పత్రాలతో పౌరులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న మోసాలపై దాఖలైన కేసును సుమోటోగా విచారణకు స్వీకరించిన అత్యున్నత న్యాయస్థానం, సోమవారం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేసింది.జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు విచారణ చేపట్టింది. ఈ తరహా మోసాలకు సంబంధించి తమ పరిధిలో నమోదైన ప్రథమ సమాచార నివేదికల (ఎఫ్ఐఆర్) వివరాలు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. "దేశవ్యాప్తంగా ఒకేరీతిలో దర్యాప్తు జరిగేలా చూసేందుకు రాష్ట్రాలకు నోటీసులు జారీ చేస్తున్నాం" అని ధర్మాసనం స్పష్టం చేసింది.
ఈ 'డిజిటల్ అరెస్ట్' మోసాలు కేవలం దేశవ్యాప్తంగానే కాకుండా, దేశ సరిహద్దులు దాటి కూడా జరుగుతున్నాయని ధర్మాసనం అభిప్రాయపడింది. అందుకే ఈ కేసుల దర్యాప్తును కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కి అప్పగించేందుకు మొగ్గు చూపుతున్నట్లు సూచించింది.
కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, ఇలాంటి అనేక కేసులను సీబీఐ ఇప్పటికే దర్యాప్తు చేస్తోందని, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సైబర్ క్రైమ్ విభాగం సాంకేతిక సహకారం అందిస్తోందని కోర్టుకు తెలిపారు. అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి మాట్లాడుతూ, ఈ మోసాల వెనుక ఉన్న మనీలాండరింగ్ ముఠాలు భారత్ బయట నుంచి, ముఖ్యంగా మయన్మార్, థాయ్‌లాండ్ వంటి దేశాల నుంచి పనిచేస్తున్నాయని వివరించారు.
విచారణ సందర్భంగా, హర్యానా ప్రభుత్వం స్పందిస్తూ... అంబాలా సైబర్ క్రైమ్ బ్రాంచ్‌లో రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని, దర్యాప్తును సీబీఐకి బదిలీ చేయడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలియజేసింది. సంబంధిత ఇతర ఎఫ్ఐఆర్‌ల వివరాలు సమర్పించేందుకు వారం రోజుల సమయం కోరగా, ధర్మాసనం అనుమతించింది.
ఈ క్రమంలో, అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు తమ పరిధిలో నమోదైన 'డిజిటల్ అరెస్ట్' సంబంధిత ఎఫ్ఐఆర్‌ల వివరాలను అందించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రస్తుతానికి అధికారికంగా కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాల్సిన అవసరం లేదని, కేవలం కేసుల వివరాలను రికార్డుల రూపంలో అందించాలని స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వాలు తమ నివేదికలు సమర్పించిన తర్వాత ఈ కేసుపై తదుపరి విచారణ జరగనుంది.

# మొదలైన మొంథా

(మొదటి పేజీ తరువాయి)

మొంథా తుఫాన్‌పై ఆందోళన వద్దని, అప్రమత్తంగా ఉందామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సోమవారం రాత్రి 10గంటలకు రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్‌లో తుఫాన్ ప్రభావంపై వాతావరణ శాఖ అధికారులతో ఆయన సమీక్ష చేశారు. తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంపై మంగళవారం నుంచి అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ తెలపగా.. దీనిపై రియల్‌టైమ్‌లో ప్రజలకు సమాచారం అందించాలని సీఎం ఆదేశించారు. "ప్రభుత్వ సన్నాహాలు, సేవలపై ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుని, ఎప్పటికప్పుడు మెరుగుపర్చుకుంటూ పని చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఇప్పటి వరకు తుఫాన్ సన్నద్ధతపై ఐవీఆర్ఎస్ విధానంలో సేకరించిన సమాచారంపైనా సీఎం సమీక్ష చేశారు. అంతకుముందు... ఇదే అంశంపై ఆయన అధికారులను అప్రమత్తం చేశారు. మంగళవారం ఉదయం నుంచి ప్రతి గంటకూ తుఫాన్ బులిటెన్లు విడుదల చేయాలని ఆదేశించారు. తుఫాన్ రక్షణ చర్యల విధుల్లో అలసత్వం వహించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. తుఫాన్ తీరం దాటే సమయంలో ఆస్తి, ప్రాణ నష్టం జరిగేందుకు అవకాశం ఉంటుందని, ఆ సమయంలో ప్రజలెవ్వరూ బయటకు రాకుండా అలర్ట్ చేయాలని చంద్రబాబు కోరారు. ఎప్పటికప్పుడు సంక్షిప్త సందేశాలు పంపి, అవగాహన పెంచాలని, తిత్లీ, హరికేన్, హుద్‌హుద్ తుఫాన్ల అనుభవాన్ని వినియోగించాలని సీఎం సూచించారు. 'రియల్ టైమ్‌లో నీటి ప్రవాహాలను పర్యవేక్షించాలి. వరద నీరు వెళ్లేందుకు వీలుగా డ్రెయిన్లలో బ్లాక్స్ లేకుండా పటిష్ఠం చేయాలి. చెరువులు, కాలువ గట్లు తెగిపోకుండా చూసుకోవాలి. సమాచార వ్యవస్థకు అంతరాయం కలగకుండా, శాటిలైట్ ఫోన్లు వినియోగించాలి. ప్రత్యేకంగా మొబైల్ టవర్లు ఏర్పాటు చేయాలి. తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉండే 2,707 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. 110 మండలాల్లోని సచివాలయాల్లో 3,211 జనరేటర్లను బ్యాకప్ కోసం వినియోగించాలి. తుఫాన్ వల్ల ఎవ్వరూ ప్రమాదాల బారిన పడకూడదు.
ఒక్క మరణం కూడా సంభవించకూడదు. సముద్ర తీరంలోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలి" అని అధికారులకు చంద్రబాబు స్పష్టం చేశారు. మంగళవారం కృష్ణా జిల్లాలో అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు సీఎంకు వివరించారు. గుంటూరు, బాపట్ల, ఎన్టీఆర్, పల్నాడు, పశ్చిమగోదావరి జిల్లాల్లో భారీ వర్షాలు పడొచ్చని తెలిపారు. ఎక్కువ వర్షపాతం కురిసే ప్రాంతాలను గుర్తించి, జిల్లా అధికారులు ముందస్తు రక్షణ చర్యలు తీసుకునేలా చూడాలని సీఎం ఆదేశించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ దళాలతో పాటు అగ్నిమాపక సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. సమీక్షలో మంత్రి లోకేష్, సీఎస్ విజయానంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### తుఫాన్ బాధిత కుటుంబానికి 25 కేజీల బియ్యం -సీఎం ఆదేశాలు

'మొంథా తుఫాన్ కార్యాచరణ భవిష్యత్‌లో వచ్చే తుఫాన్లను ఎదుర్కొనేందుకు ఒక మోడల్ కావాలి' అని సీఎం చంద్రబాబు నిర్దేశించారు. మొంథా తుఫాన్‌పై కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులతో సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'విజయవాడ, మంగళగిరి, విశాఖ వంటి ప్రాంతాల్లో కొండచరియలు జారి పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పునరావాస కేంద్రాల్లో బాధితులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి. మెడికల్ క్యాంపులు నిర్వహించాలి. పునరావాస కేంద్రాలకు ప్రత్యేకంగా ఇన్‌చార్జి అధికారుల ను నియమించాలి. పునరావాస కేంద్రాల నుంచి తిరిగి వెళ్లేటప్పుడు ఒక్కో కుటుంబానికి 25కిలోల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలి. వలంటరీగా వచ్చే వారిని సహాయ కార్యక్రమాలకు వినియోగించుకోవాలి' అని సీఎం ఆదేశించారు.

### చంద్రబాబుకు ప్రధాని మోదీ ఫోన్

**మంత్రి లోకేశ్‌కు పీఎంవోతో సమన్వయ బాధ్యతలు**

మొంథా ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను ప్రధాని నరేంద్రమోదీ తనకు ఫోన్ చేసి, అడిగి తెలుసుకున్నారని సీఎం చంద్రబాబు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలను ప్రధానికి వివరించగా, కేంద్రం నుంచి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని మోదీ భరోసా ఇచ్చారని చంద్రబాబు తెలిపారు. ఈ సందర్భంగా పీఎంవోతో సమన్వయం బాధ్యతను మంత్రి లోకేశ్‌కు సీఎం అప్పగించారు.

### సన్నద్ధతపై 83శాతం సంతృప్తి : అధికారులు

అధికారులు ఎన్ని రివ్యూలు చేశారనేది కాదని, క్షేత్రస్థాయిలో ఎంత మేర ప్రభావం చూపిందనేది ముఖ్యమని, దీనికి ప్రజాభిప్రాయాన్ని ప్రాతిపదికగా తీసుకోవాలని చంద్రబాబు స్పష్టం చేశారు. తుఫాన్‌పై ప్రభుత్వ సన్నద్ధత ఎలా ఉందనే అంశంపై సేకరించిన ప్రజాభిప్రాయంలో 83న్ల సంతృప్తి వ్యక్తమైందని అధికారులు వివరించారు. తుఫాన్‌కు సంబంధించి జాగ్రత్తలపై మీమీ ప్రాంతాల్లో సమావేశాలు జరిగాయా అన్న ప్రశ్నకు 70శాతం మంది అవును.. అని సమాధానమిచ్చారని తెలిపారు. ముందు జాగ్రత్తలపై 74శాతం మంది సంతృప్తిగా ఉన్నారని అధికారులు వివరించారు. ప్రజలను అప్రమత్తం చేసే క్రమంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టం ఏర్పాటు చేసినట్లు ఐటీ సెక్రటరీ కాటంనేని భాస్కర్ తెలిపారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో తొలిసారిగా ఈ సిస్టంను ఏర్పాటు చేశామని, రాష్ట్ర స్థాయిలో ఉన్న సమాచారం ఆధారంగా ఆర్టీజీఎస్ సెంటర్ నుంచి నేరుగా ఆయా ప్రాంతాలకు మైక్‌ల ద్వారా అప్రమత్తం చేసే అవకాశం ఉందని తెలిపారు.

# అప్రమత్తంగా ఉండి చర్యలు తీసుకోవాలి



ఈ సమావేశంలో అధికారులకి పలు కీలక సూచనలు చేశారు డిప్యూటీ సీఎం. కాకినాడ జిల్లాలో 12 మండలాలపై మొంథా తుపాను ప్రభావం ఉంటుందని తెలిసిన క్రమంలో ముందస్తు చర్యలు పకడ్బందీగా ఉండాలని సూచించారు పవన్ కల్యాణ్. ప్రభావిత ప్రాంతాల్లో ఉన్నవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడంతోపాటు వారికి అవసరమైన ఆహారం, రక్షిత తాగునీరు, పాలు, ఔషధాలు సమకూర్చుకోవాలని మార్గనిర్దేశర చేశారు. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందాలు, గజ ఈతగాళ్లు సిద్ధంగా ఉన్నారని చెప్పుకొచ్చారు. ఈ విషయాన్ని ప్రజలకి తెలియ జేయాలని సూచించారు పవన్ కల్యాణ్. ప్రజలు ఎలాంటి ఆందోళనకి గురికాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మొంథా తుపాను తీరం దాటే సమయంలో గాలుల తీవ్రత ఎక్కువగా ఉన్నందున విద్యుత్ స్తంభాలు పడిపోయే అవకాశం ఉంటుందని తెలిపారు. తుపాను దృష్ట్యా విద్యుత్ స్తంభాలు ఒకవేళ పడిపోతే వాటి పునరుద్ధరణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, రోగుల వివరాలు తెలుసుకొని.. వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని దిశానిర్దేశర చేశారు. 24 గంటలూ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలు జారీ చేశారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**- కడియం శ్రీహరి -ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం -మద్దతు ధరతో పాటు బోనస్ హామీ**




**హనుమకొండ బ్యూరో /అక్టోబర్ 24 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా ధర్మసాగర్/వేలేరు మండలం ముప్పారం, వేలేరు మండలం పీచర గ్రామాలలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రారంభించారు ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయానికి, రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు రైతులు దళారుల వద్ద నష్టపోవద్దనే ఉద్దేశ్యంతోనే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు

**రైతులకు భరోసా %-% బోనస్‌తో మద్దతు ధర**

ఈ సీజన్‌లో మద్దతు ధరతో పాటు బోనస్ కూడా రైతుల ఖాతాలలో వారం రోజుల్లో జమ అవుతుందని తెలిపారు సన్న రకం ధాన్యానికి 2389 రూపాయలు, సాధారణ రకానికి 2369 రూపాయల మద్దతు ధర నిర్ణయించామని చెప్పారు మిల్లర్లు రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు

**కొనుగోలు కేంద్రాల్లో సమగ్ర సదుపాయాలు**

రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా క్లీనింగ్ మిషన్, మాయిశ్చర్ మిషన్, త్రాగునీరు, విద్యుత్ లైట్లు, టార్పాలిన్ లు వంటి సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు వర్షాకాలం దృష్ట్యా ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు

**మహిళా సంఘాలకు అవకాశాలు**

మహిళలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో మహిళా సంఘాలకు ధాన్యం కొనుగోలు కేంద్రాల బాధ్యతలు అప్పగిస్తున్నామని తెలిపారు

**దళారుల వద్దకు వెళ్లవద్దు %-% రైతులకు పిలుపు**

రైతులు ప్రభుత్వ కేంద్రాలలోనే ధాన్యం అమ్ముకోవాలని, దళారుల వద్దకు వెళ్లి నష్టపోవద్దని పిలుపునిచ్చారు ప్రభుత్వ కేంద్రాలు లేకుంటే మిల్లర్లు కనీసం రెండు వేలు తక్కువ చెల్లిస్తారని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు

**రైతు పథకాలలో తెలంగాణ అగ్రస్థానం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని చెప్పారు 25లక్షల మంది రైతులకు 21వేల కోట్ల రుణమాఫీ, 9రోజుల్లో 9వేల కోట్లు పెట్టుబడి సాయం, సన్నాలకు 500 రూపాయల బోనస్ వంటి పథకాలు చరిత్రాత్మకమని అన్నారు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత గృహ విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలు ప్రజలకు మేలు చేస్తున్నాయని వివరించారు

**నియోజకవర్గ అభివృద్ధికి కడియం శ్రీహరి కృషి**

గత రెండు ఏళ్లలో 1388 కోట్ల అభివృద్ధి నిధులు తెచ్చానని ఎమ్మెల్యే తెలిపారు ముప్పారం గ్రామానికి 20లక్షల సిసి రోడ్లు, 38 ఇందిరమ్మ ఇళ్లు, పీచర గ్రామానికి 83లక్షల సిసి రోడ్లు, 65 ఇళ్లు మంజూరు అయ్యాయని చెప్పారు రెండవ విడతలో ఇరువురు గ్రామాలకు మరో 50 ఇళ్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు

**రోడ్లు, లిఫ్ట్ పథకాలపై దృష్టి**

ఆర్ అండ్ బి శాఖ ద్వారా మడికొండ నుండి నారాయణగిరి, నారాయణగిరి నుండి కొత్తకొండ వరకు 16.70 కిలోమీటర్ల డబుల్ రోడ్డుకు 24.25 కోట్లు మంజూరు అయ్యాయని తెలిపారు పంచాయతీ రాజ్ శాఖ ద్వారా పీచర నుండి వేలేరు, కొమ్ముగుట్ట, వావిల్లకుంట రోడ్లకు మొత్తం 10.42 కోట్లు మంజూరు అయ్యాయని వివరించారు వేలేరు, చిల్పూరు మండలాలకు సాగు నీరు అందించేందుకు గండి రామారం లిఫ్ట్ పథకాల పనులు త్వరగా పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు

**ప్రజల మద్దతు కావాలి %-% ఎమ్మెల్యే విజ్ఞప్తి**

ఇంత పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల మద్దతు కొనసాగాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ, సివిల్ సప్లై డిఎం, వ్యవసాయ శాఖ అధికారులు, తహసీల్దార్, సదానందం ఎంపీడీవో, అనిల్ కుమార్ ఏఈవోలు, మహిళా సంఘ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు

# ప్రజలే శక్తి... సోషలిజమే లక్ష్యం!

**-బీసీ రిజర్వేషన్లకు బీజేపీ అడ్డంకి -ఎన్.ఎ. స్టాలిన్ గరళవచనాలు**

**-పేదల గుడిసెలకు ఇంటి పట్టాలు - ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలంటూ డిమాండ్**




**హనుమకొండ, బ్యూరో/అక్టోబర్27:( జర్నలిస్ట్ వార్త):** దేశంలో పాలక వర్గాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజాస్వామిక ఉద్యమాలు మరింత ఉధృతం కావాలని సిపిఐ హనుమకొండ మండల కార్యదర్శి ఎన్.ఎ. స్టాలిన్ పిలుపునిచ్చారు.రామారంలో సిపిఐ ఆధ్వర్యంలో జరిగిన శాఖ సమావేశంలో ఆయన మాట్లాడుతూ %-% సోషలిస్టు వ్యవస్థ నిర్మాణమే కమ్యూనిస్టుల అసలైన లక్ష్యం అన్నారు.

**బీసీ రిజర్వేషన్లపై బీజేపీ కుట్ర %-% స్టాలిన్ ఆరోపణ**

రాష్ట్ర శాసనసభ ఆమోదించిన 42 శాతం రిజర్వేషన్ల బిల్లును గవర్నర్ నిలిపివేయడం వెనుక బీజేపీ పాత్ర స్పష్టమని స్టాలిన్ అన్నారు.బీసీల హక్కులను కాపాడాలంటే బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చి రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేశారు.

**మోడీ ప్రభుత్వంపై మండిపాటు**

మోడీ ప్రభుత్వం విభజన రాజకీయాలు చేస్తూ దేశాన్ని మతపరంగా చీల్చే కుట్రలో ఉందని ఆయన విమర్శించారు.ప్రజావ్యతిరేక, కార్మిక వ్యతిరేక, మైనార్టీ వ్యతిరేక చట్టాలు తెచ్చి దేశంలో మత విద్వేషాలను రెచ్చగొడుతోందన్నారు.

**గుడిసెల్లోనే జీవితం... పక్కా ఇల్లు ఎప్పుడు?"**

పేదల గుడిసెలకు పట్టాలు ఇవ్వడం, ఇందిరమ్మ ఇండ్లు నిర్మించడం ప్రభుత్వం ఆలస్యం చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా పేదలకు సొంత స్థలం, ఇల్లు దక్కలేదని వ్యాఖ్యానించారు.రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

**వామపక్షాలను బలోపేతం చేయండి %-% సిపిఐ పిలుపు**

బీసీ రిజర్వేషన్లకు సంపూర్ణ మద్దతు ప్రకటించిన సిపిఐ, ప్రజల హక్కులను అడ్డుకుంటున్న బీజేపీని ఎదుర్కొనేందుకు వామపక్ష శక్తులను బలోపేతం చేయాలని స్టాలిన్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం ల్లో దామెర సుదర్శన్, మోతె రమేష్, రాగల ప్రభాకర్, గోల్కొండ సారయ్య, వంకుడోతు రాజుకుమార్, భోగం అనురాధ, పందిళ్ల నరేష్, గజ్జెల మొగిలి, పర్వతం భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

# నాపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలంటూ...!

**కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన దీక్ష.పలువురి సంఘీభావం**

**స్వంత పార్టీ వారు హత్యాయత్నం చేస్తే..! అరెస్టులు ఉండవా...!**



**బయ్యారం/అక్టోబర్ 27( జర్నలిస్ట్ వార్త):** మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలో కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు నాయం శ్రీనివాస్ రెడ్డి పై గత నెల 21న దాడి చేసిన వారిని అరెస్టు చేయాలంటూ సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పోలీసుల వైఖరిని తప్పుబడుతూ నిరసన దీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలే బోయిన వెంకటేశ్వర్లు ,తొట్టి అశోక్, ఎల్ హెచ్ పి ఎస్ నాయకులు భూక్యా రవి నాయక్ , బీసీ కులం సంఘం మండల నాయకులు గోవర్ధన్,తుడుం దెబ్బ కుర్సం నరేష్ ,నాయకులు సంఘీభావాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొంత పార్టీ నేతలపైనే దాడులు చేయడం దుర్మార్గమని ఇలాంటి సంఘటనలు జరుగుతున్న ఎమ్మెల్యే నోరు మెదకపోవడం ఆంతర్యమేమిటని పలువురు ప్రశ్నించారు. ఇప్పటికైనా దాడి చేసిన వారిని పోలీసులు అరెస్టు చేయాలని,వారిని కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేయాలనీ వారు డిమాండ్ చేశారు .లేనియెడల చట్టపరంగా న్యాయం పరంగా కోర్టును ఆశ్రయించి దోషులకు శిక్ష పడే వరకు విశ్రమించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ నాయకులు జరుపుల శ్రీనివాస్, లాయర్ సుంకరి రజని, మంద రేణుక,కోడి అరుణ్,పర్శిక రాజు,వట్టం సాంబశివరావు ,అలెం బిక్షం,గార్ల మండలం నుండి తాళ్ల పల్లి కృష్ణ గౌడు తదితరులు పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడిని ఖండించిన ఎమ్మార్పీఎస్ - ఎంఎస్పీ నాయకులు

**నిందితుడు రాకేష్ కిషోర్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్**



**హనుమకొండ బ్యూరో /అక్టోబర్ 27( జర్నలిస్ట్ వార్త):** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయి గారి పై జరిగిన దాడిని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల నేతలు తీవ్రంగా ఖండించారు. ధర్మసాగర్ మండల కేంద్రంలో సోమవారం ఎంఎస్పీ హనుమకొండ జిల్లా అధికార ప్రతినిధి గంగారపు శ్రీనివాస్ మాదిగ అధ్యక్షతన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హనుమకొండ జిల్లా ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి కందుకూరి సోమన్న మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు బండారి సురేందర్ మాదిగ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ్భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడి యాదృచ్ఛికం కాదు... ఇది న్యాయ వ్యవస్థ, ప్రజాస్వామ్య వ్యవస్థపై, ముఖ్యంగా దళిత సమాజంపై జరిగిన దాడిగా మేము పరిగణిస్తున్నాం" అన్నారు.దాడికి పాల్పడిన రాకేష్ కిషోర్‌ను తక్షణమే అరెస్టు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అలాగే నవంబర్ 1న హైదరాబాద్‌లో జరగనున్న దళితుల ఆత్మగౌరవ నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ధర్మసాగర్ మండలంలోని ప్రతి గ్రామం నుండి బస్సులను ఏర్పాటు చేసి ప్రజలు అధిక సంఖ్యలో హాజరవ్వాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ్ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు సింగారపు పవన్ మాదిగ, వీహెచ్పీఎస్ మండల అధ్యక్షులు మాచర్ల బాబు మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల సహాయ కార్యదర్శి మట్టెడ బాలస్వామి, ఎంఎస్పీ నాయకులు పోలుమారి బాబు, చిలక రాజు, చింత తిలక్, గాదె భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన.

**-కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా ప్రవీణ్ నాయక్.**



**బయ్యారం/అక్టోబర్ 27( జర్నలిస్ట్ వార్త):** బయ్యారం మండలం కొత్తపేట-గంధంపల్లి గ్రామంలో మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ ఎంపీ 5 లక్షల నిధులతో ముత్యాలమ్మ గుడి కమ్యూనిటీ హాల్ మంజూరు చేశారు.ఈ నూతన గుడి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి భూక్యా ప్రవీణ్ నాయక్ సోమవారం శంకుస్థాపన చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ ఇల్లందు శాసన సభ్యులు కోరం కనకయ్య సహకారంతో కమ్యూనిటీ హాల్ మంజూరు చేసిన ఎంపీ పోరిక బలరాం నాయక్ కి గ్రామస్తుల తరుపున కృతజ్ఞతలు తెలిపారు.భవిష్యత్తులో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తామని,కమ్యూనిటీ హాల్ కు చెందిన నిధులు దగ్గరుండి మంజూరు చేయించిన ఎమ్మెల్యే కి గ్రామస్తులందరూ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు కారుపోతుల రామ్మూర్తి,తీగల వెంకటయ్య,బుర్ర శంకర్,చింతలూరు భాస్కర్,శీలం రంగపతి,బీరవెల్లి అశోక్ రెడ్డి, గూగులోత్ శ్రీనివాసరావు,దానసరి భద్రయ్య,పసుపులేటి సతీష్,తనకంటి రామాచారి తదితరులు పాల్గొన్నారు.

# బయ్యారం ఎంపీడీవో గా దీపిక బాధ్యతలు స్వీకరణ.



**బయ్యారం/అక్టోబర్ 27( జర్నలిస్ట్ వార్త):** మండలంలో గతంలో ఎంపీడీవో గా పని చేసిన విజయలక్ష్మి ఖమ్మం జిల్లా కు బదిలీపై వెళ్లడంతో,ఆ స్థానంలో ఎర్రబోలు దీపిక బయ్యారం మండల ఎంపీడీవో గా బాధ్యతలను సోమవారం స్వీకరించారు.ఇటీవల విడుదల చేసిన గ్రూప్ వన్ ఫలితాల్లో రాష్ట్రంలో 682 ర్యాంకు సాధించి ఎంపీడీవో గా ఉద్యోగ నియామకం పొందారు.ఇటీవల శిక్షణ పూర్తి చేసుకొని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఉత్తర్వుల మేరకు బయ్యారం ఎంపీడీవో గా బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు.వీరి స్వస్థలం ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం మాదాపురం గ్రామానికి చెందినవారుగా తెలిపారు.

# సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మాజీ దళనేత అశోక్ కు మాతృవియోగం.

**-ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సుమన్ రెడ్డి పరామర్శ.**



**బయ్యారం/అక్టోబర్ 27 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని రామచంద్రపురం గ్రామంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ మాజీ దళనేత రాష్ట్ర కార్యదర్శి కుర్సం అశోక్ మాతృమూర్తి కుర్సం సోమక్క (89) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు.మరణవార్త తెలుసుకున్న బయ్యారం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సంకపల్లి సుమన్ రెడ్డి ఇతర సభ్యులు వారి కుటుంబాన్ని పరామర్శించి కుర్సం. సోమక్క పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. మృతురాలికి ముగ్గురు కుమారులు,ఒక కూతురు సీతారాములు, ఎర్రయ్య,ఎర్రమ్మ ఉన్నట్లు తెలిపారు.మండలంలో పలువురు రాజకీయ నాయకులు, శ్రేయోభిలాషులు వారి కుటుంబాన్ని పరామర్శించారు.ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు సంపత్ యాదవ్,నాయిని ఇంద్రారెడ్డి,వెంకట్రామ్,స్వామి,ఇతర సభ్యులు పాల్గొన్నారు.

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక



## రక్తదానం చేసిన మాజీ సర్పంచ్ బానోత్ రూప్లా నాయక్

### ... ప్రశాంశ పత్రం అందజేసిన సిఐ



**స్టేషన్ ఘన్ పూర్/అక్టోబర్27 (జర్నలిస్ట్ వార్త) :** పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భం గా స్టేషన్ ఘన్పూర్ పోలీస్ సబ్ డివిజన్ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని మాగార్డెన్లో రక్తదానశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిల్పూర్ మండలంలోని ఫతేపూర్ గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్, జిల్లా నాయకులు మండల నాయకుడు బానోత్ రూప్లా నాయక్ రక్తదానం చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ ఘన్పూర్ సీఐ జి వేణు, రఘునాథ్ పెల్లి సీఐ ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి, చిల్పూర్ ఎస్ఐ నవీన్ చెతుల మీదుగా ప్రశాంశ పత్రం అందుకున్నారు.

## పోలీసుల సబ్ డివిజన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం






**స్టేషన్ ఘన్ పూర్/అక్టోబర్ 27 (జర్నలిస్ట్ వార్త):** పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భం గా స్టేషన్ ఘన్పూర్ పోలీస్ సబ్ డివిజన్ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని మాగార్డెన్లో రక్తదానశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐ జి వేణు మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా మరొకరి ప్రాణాలు నిలబెట్టి న వారమవుతామని అన్నారు.యువత రక్తదానం చేసిప్రాణం దాతలు గా నిలువాలన్నారు. ఈ రక్తదానం శిబిరంలో వివిధ గ్రామాల నుంచి రక్తదానంలో పాల్గొ న్నారు. ఈ రక్తదానం ద్వారా 125 యూనిట్ల రక్తాన్ని బ్లడ్ డొనేషన్ క్యాంపుకు అప్పగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐలు జి వేణు, ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఐ లు వినయ్ కుమార్, రమేష్, నవీన్ కుమార్, పిట్ట రాజేష్, మనీషా, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి నగదు



**గణపురం/అక్టోబర్27 (జర్నలిస్ట్ వార్త):** గణపురం మండల కేంద్రంలోని శ్రీ పట్టాభి సీతారామచంద్ర స్వామి ఆలయంలో వచ్చేనెల నవంబర్ తేదీలో 14 15 16 జరగనున్న గణపతి శివలింగ నవగ్రహ అష్ట బలిపీఠ ప్రతిష్టాపన కొరకు తమ వంతుగా రేగొండ మండల కేంద్రానికి చెందిన కీర్తిశేషులు బండి సాయిలు ( విలేఖరి) జ్ఞాపకార్థం వారి సతీమణి స్వరూప 10116 రూ ఆలయ కమిటీ చైర్మన్ తాళ్లపల్లి గోవర్ధన్ గౌడ్ కి నగదుగా ఇవ్వడం జరిగింది. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు ముసునూరి నరేష్ ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు ఇవ్వడం జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు బండారు శంకర్ మూలా శ్రీనివాస్ గౌడ్ భటిక స్వామి బూర రాజగోపాల్ గౌడ్ మాదాసు మొగిలి గౌడ్ మాదాసు అర్జున గౌడు ఉయ్యాల బిక్షపతి గౌడ్ దయ్యాలభద్రయ్య పాండవుల భద్రయ్య మోటపోతుల రాజన్న గౌడ్ గోరంటల రాజన్న గుప్త పాల్గొన్నారు.

## లాటరీల లక్కు




**భూపాలపల్లి /అక్టోబర్27 (జర్నలిస్ట్ వార్త):** జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆధ్వర్యంలో 2025%-%27 సంవత్సరాలకు గాను మద్యం దుకాణాల ఎంపిక ప్రక్రియను జిల్లా కేంద్రంలోని ఇల్లందు క్లబ్ లో లాటరీ పద్ధతిలో నిర్వహించారు. ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు మొత్తం 59 మద్యం దుకాణాల ఎంపికకు లాటరీ ప్రక్రియ చేపట్టగా, అందులో 57 దుకాణాలకు ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా వీడియో గ్రఫీ మధ్య విజయవంతంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.గెజిట్ నంబర్ 49 చల్వాయి గ్రామం, గెజిట్ నంబర్ 50 గోవిందరావుపేట, ములుగు జిల్లా మద్యం దుకాణాలకు ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్‌కమీషనర్ హైదరాబాద్ వారి ఉత్తర్వులు మేరకు లక్కీ డ్రా తీయడం నిలిపి వేశామని, తదుపరి ఉత్తర్వులు వచ్చేంతవరకు వాయిదా వేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా షాపు నెంబర్ 40కు అత్యధికంగా 77 దరఖాస్తులు రాగా, డ్రా ద్వారా 46 నెంబర్ దుకాణం ఎంపికైనట్లు తెలిపారు. డ్రా కార్యక్రమం పటిష్ట బందోబస్తు మధ్య నిర్వహించబడగా, ఎక్సైజ్ శాఖ అధికారులు, పోలీసు అధికారులు, దరఖాస్తు దారులు తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఈ ఎస్ ఎస్ శ్రీనివాస్, డీఎస్పీ సంపత్ రావు, ట్రైని డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇది హాస్పిటలేనా అంటూ సూపరింటెండెంట్ పై ఆగ్రహం వ్యక్తం చేసిన మాజీ ఎమ్మెల్యే గండ్ర...

**అర్బటాలతో ప్రారంబోత్సవాలు చేయడం కాదు మంత్రి గారు, ఒక్క రివ్యూ పెడితే వంద సమస్యలు పరిష్కారం అవుతాయి...**

**ఎక్కడ చూసిన అపరిశుభ్రతే..అడిగితే నీకేం తెలుసంటూ దబాయింపు...**

**ఆసుపత్రి సిబ్బందిని పనిచేయి అంటే పైరవీలు చేస్తున్నారు.. ఆసుపత్రి పై ప్రజలకు అపనమ్మకం ఏర్పడింది..**


**భూపాలపల్లి జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సందర్శించి, వైద్య సేవలపై అసంతృప్తి వ్యక్తం చేసిన మాజీ ఎమ్మెల్యే గండ్ర**






**భూపాలపల్లి/అక్టోబర్27 (జర్నలిస్ట్ వార్త):** భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని భూపాలపల్లి పట్టణ బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి సందర్శించిన భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి

ఈ సందర్బంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ...ప్రజలు ఆసుపత్రి నిర్వహణ లోపాలను మా దృష్టికి తీసుకురాగ ఈ రోజు మా బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి సందర్శించడం జరిగింది.ఈ సందర్భంగా ఆసుపత్రిలో చెత్త పెరుకపోయింది, టాయిలెట్స్ అపరిశుభ్రంగా దుర్వాసన వెదజల్లుతున్నాయి.ఇదేంటి అని ప్రశ్నించ్చిన మహిళలపై మీకేం తెలుసంటూ దురుసుగా ప్రవర్తించడం సరియైన పద్ధతి కాదు, వారి



పద్ధతి మార్చుకోవాల్సిందిగా కోరుతున్నాం. సరియైన ఇంటర్నెట్ సౌకర్యం కల్పించి సర్వర్ సమస్య లేకుండా చేసి పేషెంట్ వెయిటింగ్ లేకుండా చూడాలి. గర్భిణీలు వారి వివరాలు నమోదు చేసుకోవడానికి గంటల తరబడి నిలబడటం కనీసం వారు కూర్చోవడానికి చైర్స్ కూడా లేకపోవడం బాధాకరం. అదే విధంగా ప్రజలకు అత్యంత అవసరమైన వైద్య పరికరం %CT% స్కాన్ అమర్చి నెలలు తరబడి అవుతున్న ఇంత వరకు ప్రారంభించకపోవడం దురదృష్టకరం.ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రివర్యులు దామోదర రాజానర్సింహా గారిని కోరుతున్నాం అర్బటాలతో ప్రారంబోత్సవాలు చేయడం కాదు ఒక్క రివ్యూ పెడితె వంద సమస్యలు పరిష్కారం అవుతాయని గుర్తు చేశారు.అదే విధంగా మన జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రివర్యులు శ్రీధర్ బాబు గారు ఆసుపత్రి పై దృష్టి సారించి లోపాలను సరిచేయాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు.అదే విధంగా జిల్లా కలెక్టర్ నెలకి ఒక్కసారి అయిన విజిట్ చేయాలని కోరారు

## మాజీ మున్సిపల్ చైర్మన్ వడ్లూరి విజయ్ కుమార్ జన్మదిన వేడుకలు


### వడ్లూరి విజయ్ కుమార్ సేవలు ఆదర్శప్రాయం



**హుజురాబాద్/అక్టోబర్ 27(జర్నలిస్ట్ వార్త)** మాజీ మున్సిపల్ చైర్మన్ వడ్లూరి విజయ్ కుమార్ నిస్వార్థ సేవలు ఆదర్శప్రాయమని మానవ విలువల పరిరక్షణ జాతీయ అధ్యక్షులు ప్రజాకవి రచయిత తత్వవేత్త బ్రహ్మశ్రీ డాక్టర్ నాగుల సత్యం గౌడ్ పేర్కొన్నారు. అనంతరం పట్టణంలోని అవంతి కన్వెన్షన్ మీటింగ్ హాల్లో విజయ్ కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయకుమార్ కు పట్టు శాలువా కప్పి, ఆధ్యాత్మిక కవిత సారపు జ్ఞాపకను, మరియు బొకే అందజేసి కేకు తో పాటు సీటును తినిపించారు.ఈ సందర్భంగా సత్యం గౌడ్ మాట్లాడుతూ...విజయ్ కుమార్ తన దగ్గరికి పేదవారు ఎవరు వచ్చిన తనకు తోచిన సహాయం చేస్తూ, సేవా భావమే జీవిత లక్ష్యంగా ఎంచుకున్న విజయ్ కుమార్ సేవలు అభినందనీయం అన్నారు. తన హయాంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్మన్ గా హుజురాబాద్ పట్టణాన్ని ఎంతో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే మంచి పేరు తెచ్చుకోవడం గర్వకారణం అన్నారు. నాయకులంతా ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించినప్పుడే నాయకులుగా మంచి పేరు తెచ్చుకోవడం అవుతుందన్నారు. స్వార్థానికి పాల్పడక మంచి మానవత్వాన్ని పెంపొందించే దిశగా, ప్రతి మనిషి నడుచుకొని మానవ జన్మ ను సార్థకం చేసుకోవాలని సత్యంగాడు పిలుపునిచ్చారు. వ్యాధి లాంటి స్వార్థం వదులుకోవడంలోనే లోక కళ్యాణం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు రుద్రారపు రామచంద్రం, సిపిఐ నాయకులు శ్రావణ్, మలుగూరి ప్రభాకర్, బొడ్డు సంజయ్, తునికి వసంత్, నందగిరి శ్రీనివాస్, బాబురావు, వెంకటస్వామి సాయిల రాజు, జడల సమ్మయ్య, బండ నవీన్, చందు తదితరులు పాల్గొన్నారు.

## లాటరీ ద్వారా పారదర్శకంగా మద్యం షాపుల కేటాయింపు ఖరారు...

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి






**ఖమ్మంబ్యూరో/అక్టోబర్ 27(జర్నలిస్ట్ వార్త):** లాటరీ పద్దతి ద్వారా పారదర్శకంగా జిల్లాలో మద్యం షాపులు కేటాయించినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సోమవారం స్థానిక సీక్వెల్ రిసార్ట్స్ లో నిర్వహించిన మద్యం (ఏ4) షాపుల కేటాయింపు ప్రక్రియలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 116 ఏ4 మద్యం షాపుల్లో ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు గౌడ కులస్థులకు 18, ఎస్సీలకు 14, ఎస్టీ లకు 8 రిజర్వ్ చేయగా, మిగతా 76 షాపులను ఓపెన్ టు ఆల్ గా కేటాయించి, అన్ని షాపులకు లాటరీ ద్వారా కేటాయింపులు చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని 116 ఏ4 మద్యం షాపులకు గాను 4430 దరఖాస్తులు వచ్చాయని, అధికంగా గెజిట్ సీరియల్ నెం. 27 నకు 75, అత్యల్పంగా గెజిట్ నెం.లు 73, 75 లకు 24 చొప్పున దరఖాస్తులు అందినట్లు తెలిపారు. దరఖాస్తుదారుల సమక్షంలో ప్రతి షాపుకు లక్కీ డ్రా తీస్తూ, పారదర్శకంగా లాటరీ పద్ధతిన మద్యం షాపుల కేటాయింపు ఖరారు చేశామన్నారు. ఎలాంటి అనుమానాలకు ఆస్కారం లేకుండా మద్యం షాపుల కేటాయింపు మొత్తం ప్రక్రియను వీడియోగ్రఫీ చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. లక్కీ డ్రాలో అదృష్టం వరించి, మద్యం షాపులను దక్కించుకున్నవారు నిబంధనలను అనుసరిస్తూ, లైసెన్స్ ఫీజు రూపేణా నిర్ణీత రుసుము చెల్లించాలని జిల్లా కలెక్టర్ అన్నారు.పెద్ద సంఖ్యలో దరఖాస్తుదారులు, మద్దతుదారులు హాజరుకావడంతో టోకెన్ కలిగి ఉన్న వారినే లోనికి అనుమతించారు. వచ్చినవారికి ఇబ్బందులు కలగకుండా త్రాగునీరు, మొబైల్ టాయిలెట్లు, వైద్య శిబిరం తదితర సదుపాయాల కల్పన చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తావులేకుండా రిసార్ట్ తో పాటు, పరిసర ప్రాంతాల్లోనూ పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు. మద్యం షాపుల కేటాయింపు లక్కీ డ్రా ప్రశాంతంగా ముగిసిందిఈ కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జి. జనార్ధన్ రెడ్డి, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి. నాగేంద్ర రెడ్డి, సహాయ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు వేణుగోపాల్ రెడ్డి, తిరుపతి, ఎక్సైజ్ సిఐ కృష్ణ, ఎక్సైజ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు ఎలాంటి పైరవీలు పైరవీలు లేకుండా మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా పోలీస్ సేవలను వినియోగించుకోవాలి

### -జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఐపిఎస్



**భూపాలపల్లి /అక్టోబర్ 27(జర్నలిస్ట్ వార్త):** భూపాలపల్లి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఈ రోజు ప్రజా దివాస్ కార్యక్రమాన్ని, జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఐపీఎస్, నిర్వహించారు. ప్రజాదివాస్ కార్యక్రమంలో భాగంగా, జిల్లా వ్యాప్తంగా వచ్చిన పిర్యాదుదారుల నుండి మొత్తం 10 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజల సమస్యలను విని, వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు తక్షణ సూచనలు చేశారు. ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తూ, సంబంధిత పోలీస్ స్టేషన్ల సిఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి, సమస్యల పరిష్కారానికి దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ కిరణ్ ఖరే గారు మాట్లాడుతూ %-%ప్రజలు ఎలాంటి పైరవీలు లేకుండా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా, నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలి. చట్టబద్ధ పరిష్కారం ద్వారా ప్రజలకు న్యాయం జరుగుతుంది. శాంతి భద్రతలను కాపాడుతూ ప్రజలకు మరింత దగ్గరగా ఉండడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు. అలాగే, ప్రతి సోమవారం ప్రజాదివాస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, సంబంధిత అధికారుల సహకారంతో వాటిని పరిష్కరిస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు.

## బాధితులకు పరుపాటి ఆర్థిక సాయం



**రాయపర్తి/అక్టోబర్ 27(జర్నలిస్ట్ వార్త):** మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు మండలంలోని రాగన్నగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు బలగాని యాదమ్మ,సరికొండ వెంకట్ రెడ్డి అనారోగ్యాలతో బాధపడుతున్నారు.విషయం తెలుసుకున్న ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మెన్,బిఆర్ఎస్ జిల్లా నాయకులు పరు పాటి శ్రీనివాస్ రెడ్డి సోమవారం బాధితులను పరామర్శించి ఆర్థిక సహాయాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి,లేతాకుల రంగా రెడ్డి, ఫౌండేషన్ ప్రతినిధిలు లేతాకుల మధుకర్ రెడ్డి, గజావెల్లి ప్రసాద్‌లి మాజీ ఎంపీటీసీ కంది ప్రభాకర్,సంకినేని ఎల్లస్వామి, కోలా సంపత్, చందు రామ్, ఉబ్బని సింహాద్రి, జీవన్, చందు లక్ష్మన్, ఐత జంపి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో వచ్చినా సమస్యలు పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలి

## అదనపు కలెక్టర్ అశోక్ కుమార్





**భూపాలపల్లి/అక్టోబర్ 27 (జర్నలిస్ట్ వార్త):** వచ్చినా సమస్యలు పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలనిలు అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ అన్నారు. సోమవారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదుల దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుండి మొత్తం 36 దరఖాస్తులు స్వీకరించామని, వాటిని సంబంధిత శాఖాధికారులకు తక్షణ పరిష్కారానికి ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కారం కావాలనే ఉద్దేశంతో ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అధికారులు ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును ప్రాధాన్యతగా తీసుకోవాలని, తీసుకున్న చర్యలపై నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఆర్డీఓ రవి, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

## - డిఆర్డిఏ పిడి రామ్ రెడ్డి.



**రాయపర్తి/అక్టోబర్ 27(జర్నలిస్ట్ వార్త):** ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిఆర్డిఏ పిడి రామ్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కొలను పల్లి, కొండూరు, రాయపర్తి, మైలారం రాయపర్తి ఐకేపీ,మండల కేంద్రంలోని రైతు వేదిక ఆవరణంలో పాక్స్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వర్ధన్నపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పిడి రామ్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు తమ పంటను అమ్ముకొని గిట్టుబాటు ధరను పొందాలని అన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలని అన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని ఉద్దేశంతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందని అన్నారు.కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో డి సి ఎస్ ఓ డి.కిష్టయ్య,డీఎం సివిల్ సప్లయస్ బి.సంధ్యారాణి,డీపీఎం దాసు,తహసిల్దార్ ఏం శ్రీనివాస్,ఎంపీడీవో జి కిషన్, ఏపీఎం రవీందర్, పిఎసిఎస్ చైర్మన్ కొండూరు రామచంద్రారెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యా నాయక్, మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, టిపిసిసి మాజీ కార్యదర్శి బిల్లా సుధీర్ రెడ్డి, పాలకుర్తి సోమనాధ ఆలయ చైర్మన్ టి కృష్ణమాచార్యులు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు భూక్య సమ్మయ్య,ఆకుల సురేందర్ రావు,మాచర్ల ప్రభాకర్,పెండ్లి మహేందర్ రెడ్డి, రెంటాల గోవర్ధన్ రెడ్డి, ఎసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, చిర్ర మల్లయ్య, ఉల్లేంగుల నర్సయ్య,చెవ్వు కాశీనాథం,ఎండి నయీమ్, పాల్వంచ కోటేశ్వర్,గుగులోత్ యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

# పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం



రాయపర్తి,/అక్టోబర్ 27(జర్నలిస్ట్ వార్త): మండలంలోని మైలారం గ్రామంలోని భాగ్యలక్ష్మి జిన్నింగ్ పత్తి మిల్లులో సిసిఐ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం వర్ధన్నపేట మార్కెట్ కమిటీ చైర్మన్ నరకుడు వెంకటయ్య వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు.రైతులు తేమ లేకుండా చూసుకొని నాణ్యమైన పత్తి నీ తీసుకు వచ్చి మద్దతు ధర పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో డిఆర్డిఎ పిడి రామ్ రెడ్డి,డి సి ఎస్ ఓ డి.కిష్టయ్య,డీఎం సివిల్ సప్లయస్ బి.సంధ్యారాణి,డీపీఎం దాసు,తహసిల్దార్ ఏం శ్రీనివాస్,ఎంపీడీవో జి కిషన్, ఏపీఎం రవీందర్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యా నాయక్, మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, టిపిసిసి మాజీ కార్యదర్శి బిల్లా సుధీర్ రెడ్డి, పాలకుర్తి సోమనాధ ఆలయ చైర్మన్ టి కృష్ణమాచార్యులు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు భూక్య సమ్మయ్య,ఆకుల సురేందర్ రావు,మాచర్ల ప్రభాకర్,పెండ్లి మహేందర్ రెడ్డి, రెంటాల గోవర్ధన్ రెడ్డి, ఎసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, చిర్ర మల్లయ్య, ఉల్లేంగుల నర్సయ్య,చెవ్వు కాశీనాథం,ఎండి నయీమ్, పాల్వంచ కోటేశ్వర్,గుగులోత్ యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

# డిసిపి సరితమ్మ ను మర్యాదపూర్వకంగా కలిసిన బీసీ నాయకులు కోడూరు వీర కృష్ణ.

## కార్తీక మాస వన సమారాధన కు ప్రత్యేక ఆహ్వానం.



**తల్లాడ/అక్టోబర్27 (జర్నలిస్ట్ వార్త):** నవంబర్ 16వ తారీఖున సత్తుపల్లి లో జరిగే కుమ్మర శాలివాహన కార్తిక వన సమారాధన కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు, ఈ కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి సరితమ్మ ను సత్తుపల్లి నియోజవర్గం బీసీ నాయకులు కోడూరు వీర కృష్ణ విజయవాడలోని మర్యాదపూర్వకంగా కలిసి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రావాల్సిందిగా ఆహ్వానించడం జరిగింది . ఈ సందర్భంగా కొంతసేపు ఆమెతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో చిలివేరు వెంకట అప్పారావు,సత్తుపల్లి కుమ్మర శాలివాహన ప్రజాపతి కుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రెడ్డిగుడిలో కార్తీక శోభ

**-కార్తీక తొలి సోమవారంతో ఆలయం సందడి**

**- పట్టు వస్త్రాలు, 41 కొబ్బరికాయల సమర్పణ**

**- ప్రతి సోమవారం ఇదే భక్తి ప్రవాహం**



**గణపురం/అక్టోబర్27 (జర్నలిస్టు వార్త):**
గణపురం: మండల కేంద్రంలోని కాకతీయ కళాక్షేత్రం నాగలింగేశ్వరాలయం రెడ్డిగుడిలో కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా భక్తి శోభ వెల్లివిరిసింది. తెల్లవారుజామున నుంచే భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. పూలతో, దీపాలతో నిండిపోతూ ఆలయం పౌర్ణమి వెలుగులా మెరిసిపోయింది. ఉదయం 5 గంటలకు ఆలయ అర్చకులు భద్రమయ్య ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. అనంతరం నాగలింగేశ్వర స్వామీవారికి ప్రత్యేక అర్చనలు, పుష్పాభిషేకం, నామస్మరణ కార్యక్రమాలు శ్రద్ధాభక్తులతో సాగాయి. స్వామివారి దర్శనార్థం భక్తులు దీపదానాలు సమర్పిస్తూ క్షేమాభివృద్ధులు కోరుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి చెందిన ఆదిమూల మురళి అనిత దంపతులు స్వామివారి అలంకరణార్థం పట్టు వస్త్రాలను అందజేయగా, ఆకుల మల్లయ్య సుభద్ర దంపతులు కార్తీకమాస నిత్యాభిషేక కార్యక్రమాల కోసం 41 కొబ్బరికాయలను సమర్పించారు. వారి భక్తిశ్రద్ధలను చూసి అందరూ ప్రశంసించారు. ఈ దంపతులపై శ్రీ నాగలింగేశ్వర స్వామి అనుగ్రహం కురవాలని అర్చకులు ఆకాంక్షించారు. ప్రతి కార్తీక సోమవారం ఇలాగే భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తుండటంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక కాంతులతో నిండిపోతున్నాయి. ప్రతి సోమవారం ఈ భక్తిశోభ ఇలాగే కొనసాగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

# ఈ నెల 30 న రాష్ట్ర వ్యాప్త విద్యా సంస్థల బంద్ ను విజయవంతం చేయండి

**పేద విద్యార్థుల జీవితాలతో చేలగటమాడుతున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం..**


**పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్స్ మరియు ఫీజు రీయింబర్స్ మెంట్ ను వెంటనే విడుదల చేయాలి**

**ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్**




**పెనుబల్లి/అక్టోబర్ 27(జర్నలిస్టు వార్త):**
భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఖమ్మం నగర ముఖ్య కార్యకర్తల సమావేశం నగర కేంద్రంలోని సుందరయ్య భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి టి. ప్రవీణ్ మాట్లాడుతూ ఈనెల 30వ తేదీన ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర వ్యాప్త విద్యా సంస్థల బంద్ ను విజయవంతం చేయాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులకు దొంగ హామీలు ఇచ్చి గద్దనెక్కారు అన్నారు గత రెండు సంవత్సరాల నుండి తెలంగాణ రాష్ట్రంలో 8,150 కోట్ల దాకా స్కాలర్షిప్స్ ఫీజు రీయింబర్స్ మెంట్ పెండింగ్లో ఉంది అన్నారు. ప్రభుత్వ ప్రైవేటు కళాశాలలో చదివే విద్యార్థులకు సర్టిఫికెట్స్ తీసుకుందామంటే ప్రభుత్వం నుండి డబ్బులు రాలేదని విద్యా సంస్థల యజమాన్యాలు సర్టిఫికెట్స్ ఇవ్వడం లేదన్నారు గత నెల రోజుల క్రితం తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రైవేటు డిగ్రీ కళాశాలలు పిజి కళాశాలలు ఇంజనీరింగ్ కళాశాలలు రాష్ట్రంలో బంద్ కు పిలుపునిస్తే రాష్ట్ర ప్రభుత్వం వారితో చర్చలు జరిపి ,1200 కోట్ల రూపాయలను రెండు దఫాలుగా విడుదల చేస్తామని చెప్పి ఒక్క రూపాయి కూడా విడుదల చేయకుండా మోసం చేసిందన్నారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న విద్య రంగ సమస్యల పై అలాగే పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్స్ ను మరియు ఫీజు రియంబర్స్మెంట్స్ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30 వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ప్రైవేటు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు పీజీ కళాశాలలు మరియు ఇంజనీరింగ్ కళాశాలలు ప్రొఫెషనల్ కళాశాలలు, యూనివర్సిటీల బంద్ కు పిలుపునివ్వడం జరుగుతుందని. ఈ సందర్భంగా వారు తెలిపారు ఈ బంద్ లో విద్యార్థులు మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.
ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు వంకాయల రాజు, త్రినాధ్, లోకేష్ ,మనోజ్, రమణ, సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# వనసంరక్షణ సమితి సభ్యులకు ట్రాక్టర్ పంపిణీ...



**సత్తుపల్లి/అక్టోబర్ 27(జర్నలిస్ట్ వార్త):**
చంద్రాయపాలెం వన సమరక్షణ సమితి సభ్యులకు ట్రాక్టర్ పంపిణీ కార్యక్రమం సత్తుపల్లి మండలంలోని నీలాద్రి అర్బన్ పార్క్ వద్ద శనివారం జరిగింది. జిల్లా అటవీ అధికారి సిద్దార్థ విక్రమ్ సింగ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రూ. 11 లక్షల విలువైన ట్రాక్టర్ను సమితి సభ్యులకు అందజేశారు.
కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక ఎమ్మెల్యే మట్టా రఘుమాయి, ట్రాక్టర్ను సమితి సభ్యులు రజిన్నీ సురేష్ కుమార్, పండ్ల బాబు లకు అందజేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వన సమరక్షణ సమితులు అటవీ పరిరక్షణతో పాటు గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. వన వనరులను సమాజం, పర్యావరణ అభ్యున్నతికి వినియోగించుకోవాలి. సమితి సభ్యుల అభివృద్ధికి ప్రభుత్వం, అటవీ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటాయి. ప్రతి సభ్యుడు మరింత చెలిమిగా, నిబద్ధతతో పనిచేయాలి, అని అన్నారు.
జిల్లా అటవీ అధికారి సిద్దార్థ విక్రమ్ సింగ్ సందేశం ద్వారా మాట్లాడుతూ, వన సమరక్షణ సమితులు అటవీ సంరక్షణలో చూపిస్తున్న నిబద్ధత ప్రశంసనీయం. మీ కృషితో గ్రామాలు పచ్చగా, సమృద్ధిగా మారాలని ఆశిస్తున్నాను. సమితి బలోపేతం కోసం, సభ్యుల ఉపాధి అవకాశాల విస్తరణకు అటవీ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుంది. ట్రాక్టర్ అందుబాటులోకి రావడంతో సభ్యుల జీవనోపాధి మరింత మెరుగుపడనుంది, అని తెలిపారు.
కార్యక్రమంలో అటవీ విభాగ అధికారి వడపల్లి మంజుల, అటవీ పరిధి అధికారులు స్నేహలత, ఉమా, జిల్లా వనరక్షణ అధికారి ఎం.ఆర్.పి. రావు, అటవీ రక్షణ సిబ్బంది నాగరాజు, అరుణ్ కుమార్, కొండారెడ్డి, భాస్కర్, రమేష్, వేణుమాధవ్, బీట్ అధికారులు మరియు శాఖ సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతంగా ముగియడంతో సమితి సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.


# నేడు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పుట్టినరోజు

**- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సేవా కార్యక్రమాలకు పిలుపు**

**- లిసర్వం సిద్ధం చేసిన శీనన్న అభిమానులు**

**-రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు, బైక్ ర్యాలీలతో హెరీరెత్తించేందుకు సిద్ధం**

**వేడుకల వివరాలను వెల్లడించిన తుంబూరు దయాకర్ రెడ్డి**




**ఖమ్మం అక్టోబర్ 27 జర్నలిస్టు వార్త**
ఉమ్మడి ఖమ్మంజిల్లా ముద్దుబిడ్డ... లెజండరీ లీడర్ తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పుట్టిన రోజు వేడుకలను ఈనెల 28వ తేదీన మంగళవారం (నేడు) నిర్వహించేందుకు ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని ఊరువాడా సిద్ధం అయ్యింది. కాంగ్రెస్ నేతలు, పొంగులేటి అభిమానులు సేవా కార్యక్రమాలకు పిలుపునిచ్చారు. రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు, బైక్ ర్యాలీలతో ఉమ్మడిజిల్లాను హెరెత్తించేందుకు సిద్ధం అయ్యారు. భారీ కటౌట్లు, ఫ్లెక్సీలు, హోర్డింగ్ లను పురవీధుల్లో ఇప్పటికే ఏర్పాటు చేశారు. కాగా ఈ వేడుకలకు సంబంధించిన వివరాలను క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి వెల్లడించారు. ఉదయం 09 గంటలకు ఖమ్మం క్యాంపు కార్యాలయంలో భారీ కేక్ కటింగ్, రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా నేలకొండపల్లిలో వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి బైక్ ర్యాలీ ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 09.30గంటలకు వరంగల్ క్రాస్ రోడ్డులో, ఉదయం 10గంటలకు కల్లూరు పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ లో కేక్ కటింగ్ ఉంటుందన్నారు. ఉదయం 11 గంటలకు ముదిగొండ మెయిన్ సెంటర్ లో అన్నదాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 11.30గంటలకు కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో కేక్ కటింగ్, మధ్యాహ్నం 12గంటలకు ఖానాపురంలోని శ్రీ అభయ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అయ్యప్పస్వాములకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఇవేకాక ఇంకా అనేక ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. కావున ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని పొంగులేటి శీనన్న అభిమానులు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలందరూ ఆయా ప్రాంతాల్లో జరిగే వేడుకలు, సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యులవ్వాలని దయాకర్ రెడ్డి కోరారు.

# మల్లారం పాఠశాలకు మైక్ సెట్ వితరణ




**తల్లాడ/అక్టోబర్27(జర్నలిస్ట్ వార్త):** పేద విద్యార్థులు చదువుతున్న మల్లారం ప్రాథమిక పాఠశాల కు కటికి వెంకయ్య నాయుడు – లోవ లక్ష్మీ ల దంపతులు రు 10,000/- (పది వేల రూపాయలు) విలువైన మైక్ సెట్ ను తల్లాడ మండల విద్యాధికారి నెమ్మకంటి దామోదర ప్రసాద్ చేతుల మీదగా వితరణ చేయడం జరిగింది.మల్లారం ప్రభుత్వ పాఠశాల కు ఎంతో అవసరమైన సౌండ్ సిస్టమ్ ను అందజేసిన రాఘవ స్టీల్స్ ఎలక్ట్రికల్స్ పెయింట్స్ అధినేత శ్రీ కటికీ వెంకయ్య నాయుడుకి తల్లాడ మండల విద్యాధికారి ఎన్ . దామోదర ప్రసాద్ మల్లారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరి బాబు ఉపాధ్యాయులు పి. అనిల్ కుమార్ కామిరెడ్డి వేంకటేశ్వర రెడ్డి కృతజ్ఞతలు తెలియజేసినారు